సాక్షి ఖమ్మం

శుక్రవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2025



ముగిసిన టెన్నిస్ 'డబుల్స్' పోరు

ఖమ్మంలో జరుగుతున్న ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నీ డబుల్స్‌లో శశాంక్ – అధర్వశర్మ జోడీ ట్రోఫీ గెలుచుకుంది. 8లో



రైతు కుటుంబానికి పరిహారం

విద్యుదాఘాతంతో మృతి చెందిన లచ్చగూడెం రైతు ప్రసాద్ కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షల పరిహారం మంజూరైంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 19°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత పెరిగినా రాత్రి వరకు చల్లబడుతుంది.

అందరి ధీమా గెలుపుపైనే..

ప్రశాంతంగా ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఖమ్మంలో 93.03, భద్రాద్రిలో 91.94 శాతం పోలింగ్
- వచ్చే నెల 3నుంచి నల్లగొండలో ఓట్ల లెక్కింపు
- విజయంపై అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల లెక్కలు



ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ స్కూల్ కేంద్రంలో క్యూలైన్‌లో ఉన్న ఉపాధ్యాయులు (ఇన్‌సెట్) ఓటు వేస్తున్న ఉపాధ్యాయిని



పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేస్తున్న ఉద్యోగులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. అభ్యర్థుల తరఫున ఆయా సంఘాలు, మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు చివరి వరకు ప్రచారం చేశారు. పోలింగ్ కేంద్రాలకు సమీపాన టెంట్లు వేసుకుని తమ అభ్యర్థికే ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికలు ముగిశాక అభ్యర్థుల వారీగా నమోదైన ఓట్లపై లెక్కలు వేసుకుంటూ విజయంపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 93.03 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 91.94 శాతం పోలింగ్ నమోదైంది.

గతంతో పోలిస్తే ఎక్కువే..

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తక్కువగానే నమోదైంది. అయితే, మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు 70 శాతం పైగా నమోదైంది. ఈ సమయాన మహిళా ఉపాధ్యాయులు ఎక్కువగా వచ్చారు. ఇక గత టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే రెండు జిల్లాల్లో ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఉపాధ్యాయ సంఘాల పోటాపోటీ ప్రచారం, మరోవైపు రాజకీయ పార్టీల ప్రవేశంతో పోలింగ్ పెరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఖమ్మం జిల్లాలో 4,089 మందికి గాను 3,804మంది(93.03శాతం), భద్రాద్రి జిల్లాలో 2,022 మందికి 1,858 మంది(91.94) ఉపాధ్యాయులు ఓటు వేశారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో 3,634 మందికి 3,315 మంది(91.22 శాతం), భద్రాద్రి జిల్లాలో 87.66 శాతం పోలింగ్ నమోదైంది.

విజయం మాదంటే .. మాది

టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ ముగియడంతో ఉపాధ్యాయ సంఘాలు, మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు కేంద్రాల వారీగా తమ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయనే అంచనాతో లెక్కలు తీస్తున్నారు. ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలవగా అలుగుబెల్లి నర్సిరెడ్డి, పింగిలి శ్రీపాల్ రెడ్డి, పులి సరోత్తంరెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పూల రవీందర్, సుందర్‌రాజ్ యాదవ్ ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం చేశారు. వీరి తరఫున ఉపాధ్యాయ సంఘాలు, మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు సర్వశక్తులొడ్డారు. కొందరు అభ్యర్థులు పోలింగ్‌కు ముందు రోజు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారనే ప్రచారం జరిగింది. దీంతో విజయం ఎవరికి దక్కుతుందనే అంశం ఇటు ఉపాధ్యాయ సంఘాలు.. అటు పార్టీల్లోనూ ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

ఇక్కడ వంద శాతం..

ఉమ్మడి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం ఓటింగ్ నమోదైంది. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 37 మంది ఓటర్లకు అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ జెడ్పీ పాఠశాల కేంద్రంలో 37 మందికి 37 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంతో వంద శాతంగా నమోదైంది. ఇక కరకగూడెం జెడ్పీ పాఠశాలలోనూ 19 మందికి అందరూ ఓటు వేశారు. బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 34 మందికి 34 మంది, ఎర్రుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 55 మంది ఓటర్లకు అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జిల్లాల వారీగా ఇలా...

జిల్లా	మొత్తం ఓటర్లు	ఓటు వేసింది	పురుషులు	మహిళలు	పోలింగ్ శాతం
ఖమ్మం	4,089	3,804	2,214	1,590	93.03
భద్రాద్రి కొత్తగూడెం	2,022	1,858	973	885	91.94

ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ వివరాలు

సమయం	ఖమ్మం నమోదు	ఖమ్మం శాతం	భద్రాద్రి కొత్తగూడెం నమోదు	భద్రాద్రి కొత్తగూడెం శాతం
ఉదయం 10	832	20.35	174	8.61
మధ్యాహ్నం 12	2,222	54.34	939	46.44
మధ్యాహ్నం 2	3,252	79.53	1,484	73.66
సాయంత్రం 4	3,804	93.03	1,858	91.94

కలెక్టర్, సీపీల పరిశీలన



రిక్కాబజార్ స్కూల్ బూత్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రిక్కాబజార్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు ఎలా ఉన్నాయని ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అంతటా టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని వెల్లడించారు. ఇదే పోలింగ్ కేంద్రాన్ని సీపీ సునీల్‌దత్ సైతం పరిశీలించి భద్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. కాగా, పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత నడుమ నల్లగొండలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. కాగా, రిక్కాబజార్ పోలింగ్ కేంద్రం వద్ద టీఎస్‌యూటీఎఫ్, టీపీయూఎస్ బాధ్యుల నడుమ ఫ్లెక్సీల విషయమై వివాదం ఏర్పడింది. పరస్పరం విమర్శలు చేసుకోవడంతో పోలీసులు ఫ్లెక్సీలు తీయించి అందరినీ పంపించారు.

న్యూస్‌రీల్

కొత్త టీచర్లకు నేటి నుంచి శిక్షణ

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నియామకమైన ఉపాధ్యాయులకు బోధన అంశాలపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు 2024–డీఎస్సీ ద్వారా నియామకమైన ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)లకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేయగా, 316 మంది టీచర్లకు శిక్షణ ఇచ్చేలా 16మంది రిసోర్స్ పర్సన్లను నియమించారు.

శిక్షణ ఇలా...

తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ బోధన, తరగతి గదుల్లో వనరుల వినియోగంపై నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించే ఈ శిక్షణకు స్టేట్ రిసోర్స్ గ్రూప్‌మెంబర్ డి.కృష్ణారావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఇదిలా ఉండగా శిక్షణ కాలంలో కొత్త టీచర్లకు సెలవులు మంజూరు చేయొద్దని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ విషయమై విద్యాశాఖ ఏఎంఓ కె.రవికుమార్ మాట్లాడుతూ కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మరిన్ని మెళకువలు తెలుస్తాయని, బోధనా నైపుణ్యాలు పెరిగి విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

కూసుమంచి శివాలయానికి రూ.12.30 లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

కూసుమంచి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కూసుమంచి శివాలయానికి వివిధ రూపాల్లో రూ.12,30,175 ఆదాయం సమకూరిందని ఈఓ కె.శ్రీకాంత్ తెలిపారు. ఈసందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.3,73,397 ఆదాయం సమకూరగా, బహిరంగ వేలం, దుకాణాల ఏర్పాటుతో రూ.3,03,800 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఇక అర్చన, అభిషేకాలు, పూజల ద్వారా రూ.2,77,691, విరాళాలు, కట్నాల ద్వారా రూ.2,75,287 ఆదాయం సమకూరిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే రూ.2,70,343 ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

8న లోక్‌అదాలత్

ఖమ్మం లీగల్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో వచ్చే నెల 8వ తేదీన లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ తెలిపారు. మొత్తంగా 15 బెంచ్‌లు ఏర్పాటుచేస్తుండగా రాజీ పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, మోటారు ప్రమాదాలు, వివాహ సంబంధిత, బ్యాంకు రికవరీ కేసులను పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. పోలీస్, బీమా కంపెనీల బాధ్యులతో చర్చించి రాజీపడతగిన కేసులను గుర్తించామని తెలిపారు. రాజీమార్గమే రాజమార్గంగా గుర్తించి డబ్బు, సమయాన్ని ఆదా చేసుకునేలా కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా జడ్జి సూచించారు. కక్షిదారులకు ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.

కరుణగిరి మహోత్సవాలు ఆరంభం



ప్రార్థనలో పాల్గొన్న బిషప్ ప్రకాశ్, మత గురువులు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం కరుణగిరిలో గురువారం కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం మేత్రాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ పండుగకు విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం సంతోషదాయకమని లోక రక్షకుడైన ఏసు ప్రభువు ప్రతీ ఒక్కరికీ జీవన మార్గాన్ని ప్రబోధించారని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తే ఉన్నత స్థితికి చేరవచ్చని చెప్పారు. అందరూ ప్రేమ, దయ, కరుణ, శాంతితో వ్యవహరించాలని, తద్వారా లోకం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కరుణగిరి డైరెక్టర్ మాథ్యూ వరప్రసాద్‌రాజు, గురువులు వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి



గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న జోనల్ ఆఫీసర్ స్వరూపారాణి

నేలకొండపల్లి: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఎస్సెస్సీ, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని గురుకులాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపారాణి తెలిపారు. నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూం, కిచెన్‌ను పరిశీలించాక విద్యార్థులతో కలిసి భోజనం చేయగా మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం జోనల్ ఆఫీసర్ మాట్లాడుతూ భద్రాద్రి జోన్‌లోని ఐదు జిల్లాల గురుకులాల్లో 19,300 మంది విద్యార్థులు చదువుతుండగా నూతన మెనూ అమలులో రాజీ పడకుండా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. అలాగే, ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, వెనకబడిన వారిపై మరింత శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. పరీక్షల వేళ తాజా పండ్లు అందిస్తున్నామని తెలిపారు. కాగా, గురుకులాల్లో ప్రవేశానికి జోనల్ పరిధిలో 25,318 మంది దరఖాస్తు చేసుకోగా 97 శాతం మంది పరీక్ష రాశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, ఉద్యోగి పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లిఫ్ట్' వద్ద సబ్‌స్టేషన్

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలంలోని సాగుభూములకు నీరందించేందుకు సాగర్ ప్రధాన కాల్వపై రూ.66కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. ఈ పథకానికి విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటుచేయాల్సి ఉండగా గురువారం జలవనరులు, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. సాగర్ ప్రధాన కాల్వపై వీ.వీ.పాలెం వద్ద పంప్‌హౌస్ నిర్మిస్తున్న ప్రాంతంలోనే సబ్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ మేరకు జలవనరులశాఖ, విద్యుత్ శాఖల ఎస్‌ఈలు మంగళపుడి వెంకటేశ్వర్లు, సురేందర్‌తో పాటు రెండుశాఖల అధికారులు అనన్య, బాబురావు, రామారావు, ఝాన్సీ, మహాత్మాగాంధీ, శ్రీరాం పరిశీలించి అంచనాలపై చర్చించారు. ఉగాది నాటికి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేలా నిర్మాణం వేగంగా చేపడుతుండగా, సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టాలని నిర్ణయించారు.

ఘనంగా మల్లన్న గ్రామోత్సవం



గుంటు మల్లన్న ఊరేగింపులో అర్చకులు, అధికారులు



ఊరేగింపులో మహిళల కోలాటం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో గురువారం రాత్రి జరిగిన గుంటు మల్లన్న స్వామి గ్రామోత్సవ సంబురాలు మిన్నంటాయి. స్థానిక ట్రంకు రోడ్డులో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించగా స్వామికి అన్నాభిషేకం జరిపించాక ఊరేగింపు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వాహనంపై కొలువుదీర్చగా గ్రామోత్సవాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి ప్రారంభించారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చరణల నడుమ స్వామి వారి ఊరేగింపు పొట్టి శ్రీరాములు రోడ్డు, గాంధీచౌక్, ట్రంక్ రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు ముందు భాగాన ఏకరూప దుస్తులు ధరించిన మహిళల కోలాట నృత్యాలు, యువకుల నృత్యాలు అలరించగా భక్తులు ఓం నమఃశివాయ నామస్మరణతో పాల్గొన్నారు. ఆలయ ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు అండగా నిలుస్తాం..

- పేదలు సొంతింటి కల నిజం చేసుకోవాలి
- రేపల్లెవాడలో పర్యటించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



రేపల్లెవాడలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఏన్కూరు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రతీ దశలో అండగా నిలుస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ భరోసా కల్పించారు. ప్రభుత్వం కేటాయించే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పేదలు సొంతింటి కలను నిజం చేసుకోవాలని సూచించారు. ఏన్కూరు మండలం రేపల్లెవాడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత గ్రామంలో సాగయ్యే పంటలు, దిగుబడి, మద్దతు ధరపై ఆరా తీశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు ఎలా కట్టుకోవాలనేది లబ్ధిదారులు నిర్ణయించుకోవాలని.. ఇదేసమయాన ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల్లో పూర్తయ్యేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతీ మండల కేంద్రంలో ఇసుక డంప్ ఏర్పాటుచేసి తక్కువ ధరకే లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తామన్నారు. కాగా, అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. కాగా, గ్రామంలో వీధి కుక్కల సమస్య ఉందని స్థానికులు చెప్పగా పరిష్కరించాలని ఎంపీడీఓ రమేష్‌ను ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధనకు పట్టుదలతో కృషిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సందర్శించిన ఆయన డార్మిటరీ, కిచెన్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించాక ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరుపై ఆరాతీసిన ఆయన నెల పాటు చదువుకే ఎక్కువ సమయం కేటాయించాలని, తద్వారా మంచి మార్కులు సాధించొచ్చని తెలిపారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

తీర్థాల జాతరలో కలెక్టర్ పూజలు



సంగమేశ్వరుడి సన్నిధిలో కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

ఖమ్మంరూరల్: జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సంగమేశ్వరస్వామిని ప్రార్థించినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. రూరల్ మండలం తీర్థాలలో సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం జాతరకు వచ్చిన పలువురు భక్తులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు కలెక్టర్‌ను సత్కరించి ప్రసాదం అందజేశారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కాంట్రాక్ట్ డ్రైవర్ల ఎంపికకు కసరత్తు



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

- తొలిరోజు 85 మంది సర్టిఫికెట్ల పరిశీలన
- తమనూ పరిగణనలోకి తీసుకోవాలని అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్ల కొరతను అధిగమించేందుకు అధికారులు కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధికల్పన అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న వారి జాబితా తెప్పించుకున్నారు. ఇందులో 140 మంది ఉండగా గురువారం 85 మందిని పిలిపించి సర్టిఫికెట్లు పరిశీలించారు. మిగతా వారి సర్టిఫికెట్ల పరిశీలన రెండు, మూడు రోజుల్లో పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు.

నాలుగు నెలల కాలానికి..

ఆర్టీసీలో డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేస్తున్న క్రమాన కొరత ఏర్పడుతోంది. అయితే, కొత్త డ్రైవర్ల నియామకానికి మరింత సమయం పట్టనుండడంతో కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకానికి ప్రభుత్వం అనుమతించింది. నాలుగు నెలల కాలానికి గాను కాంట్రాక్ట్ విధానంలో డ్రైవర్లను తీసుకోవాలని అధికారులు నిర్ణయించగా, ఖమ్మం రీజియన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. ఎంపికైన వారి సేవలను నాలుగు నెలల పాటు వినియోగించుకోనున్నారు.

హైర్ బస్సు డ్రైవర్ల ఆందోళన

ఆర్టీసీ అద్దె బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు తమను కూడా కాంట్రాక్ట్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో తాము పేర్లు నమోదు చేసుకున్నా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. దీంతో రీజియన్ అధికారులు ఉన్నతాధికారులతో చర్చించాక వారి సర్టిఫికెట్లను కూడా పరిశీలించారు. ప్రక్రియ పూర్తయ్యాక జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని అధికారులు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు హంగులు

- రూ.1.19 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- కలెక్టర్ చొరవతో చకచకా పనులు



కల్లూరు మండలం వెన్నవెల్లి సెంటర్‌లో అభివృద్ధి పనులకు పునాదులు తీస్తున్న కూలీలు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకోగా, కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఇదేసమయాన కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు సిద్ధంకాగా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ప్రతిపాదనలు రూపొందించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్మాణ బాధ్యతలు అప్పగించగా, త్వరగా పూర్తయ్యేలా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించడంతో చకచకా పనులు కొనసాగుతున్నాయి.

మరుగుదొడ్లు, ఇతర వసతులు

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక హంగులు సమకూర్చడం ద్వారా పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ తరచుగా చెబుతున్నారు. ఆయన సూచనలతో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా కేంద్రాలకు ప్రహరీలు, టాయిలెట్లు నిర్మించడంతో పాటు వంట చేసేందుకు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో కిచెన్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణానికి రూ.2లక్షలు, 40 సెంటర్లలో తాగునీటి వసతి కల్పించేందుకు రూ.17వేల చొప్పున, సొంత భవనాలు ఉన్న 239 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36వేలు చొప్పున మొత్తం 1.19లక్షల నిధులు కేటాయించారు. సత్తుపల్లి, ఖమ్మం డివిజన్లలో పీఆర్ ఈఈలు, కేఎంసీ పరిధిలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

వసతుల కల్పనతో బలోపేతం



అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పిస్తూ బలోపేతం చేస్తున్నాం. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచనలతో రూ.1.19కోట్ల నిధులు కేటాయించాం. ఈ నిధులతో చేపడుతున్న పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

– కీసర రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి

క్లుప్తంగా

మార్చి 4న సెమినార్

ఖమ్మం మామిళ్లగూడెం: 'మిర్చి ధర పతనం – పరిష్కార మార్గాలు'అనే అంశంపై వచ్చేనెల 4న సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంఘం జిల్లా మహాసభ మార్చి 20న వైరాలో జరగనున్న నేపథ్యాన జిల్లా వ్యాప్తంగా రైతుల సమస్యలపై సెమినార్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 4వ తేదీన ఖమ్మం జెడ్పీ హాల్‌లో జరిగే సెమినార్‌లో వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబుతో పాటు రైతు సంఘాల బాధ్యులు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావు, నల్లమల వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

రామన్నపాలెం వాసికి డాక్టరేట్


రమ్య

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం రామన్నపాలెంకు చెందిన కొత్తపల్లి రమ్య ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంది. యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్.రాజు పర్యవేక్షణలో 'రాడార్స్ యాంటెనా'అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలో, ఇంటర్, ఇంజనీరింగ్ సత్తుపల్లి, ఎంటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేసిన రమ్య డాక్టరేట్ సాధించడంపై మాజీ సర్పంచ్ కొత్తపల్లి విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి మదన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొబ్బిళ్లపాటి బాబురావు తదితరులు అభినందించారు.

రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం


చెక్కు అందజేస్తున్న ఏడీ తిలక్

చింతకాని: మండలంలోని లచ్చగూడెంలో కొన్నాళ్ల క్రితం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన రైతు కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున పరిహారం మంజూరైంది. గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ అక్టోబర్ 5న తన సోదరుడి పొలంలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లగా.. అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విద్యుత్ శాఖ ద్వారా రూ.5 లక్షల పరిహారం మంజూరు కాగా ఏడీ తిలక్ గురువారం ఆయన కుటుంబానికి చెక్కు అందజేశారు. ఏఈ చావా శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

సత్తుపల్లిటౌన్: ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స కాకుండా ఆస్పత్రుల పేరిట పడకలు ఏర్పాటు చేసి వైద్యం నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి హెచ్చరించారు. సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో బెడ్లు ఉండడంతో పాటు ఫార్మసీ నిర్వహిస్తుండగా గురువారం ఆమె సీజ్ చేసి మాట్లాడారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరం, గంగారం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. డీఐఓ డాక్టర్ చందూనాయక్, డీఎంఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.సీతారాం, డాక్టర్ ఆర్.అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లంలోని మిర్చి చోరీ

కామేపల్లి: కల్లంలో ఆరబెట్టిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని ముచ్చర్లకు చెందిన రైతు జాల శివకృష్ణ ఇటీవల మిర్చి కోయించి కల్లంలో ఆరబెట్టాడు. బుధవారం తీర్థాల జాతరకు వెళ్లిన ఆయన గురువారం తెల్లవారుజామున కల్లం వద్దకు వచ్చేసరికి సుమారు 10 బస్తాల్లో మిర్చిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అంతేకాక మరో ఎనిమిది బస్తాల్లో మిర్చి నింపి ఉండడంతో చుట్టుపక్కల గాలించగా.. ఎలక్ట్రికల్ స్కూటీ కనిపించింది. చోరీ చేసిన మిర్చి విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, నిందితులను గుర్తించి తనకు న్యాయం చేయాలని శివకృష్ణ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినిపై అధ్యాపకుడి వేధింపులు?

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని ఓ అధ్యాపకుడు లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో గురువారం విచారణ జరిపినట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు. ఇప్పటికే ప్రిన్సిపాల్‌తో విచారణ జరిపించగా మరోమారు కళాశాలకు వెళ్లి నలుగురు అధ్యాపకులతో పాటు ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ నుంచి వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఆర్‌జేడీ, కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

కొదుమూరులో లింగ నిర్ధారణ పరీక్షలు?

- పోలీసుల అదుపులో నిర్వాహకులు

చింతకాని: మండలంలోని కొదుమూరులో నిబంధనలకు విరుద్ధంగా కొంతకాలం నుంచి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈమేరకు అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేంద్రంపై నిఘా వేసి గురువారం నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పరీక్షలు చేస్తున్న మొబైల్ వాహనం డ్రైవర్, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలియగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


పోలింగ్ కేంద్రం వద్ద స్నేహితులు


చాన్నాళ్లకు కలవడంతో చిరునవ్వులతో మాట్లాడుకుంటూ...


ఆప్యాయంగా పలకరించుకుంటున్న ఉపాధ్యాయులు


యోగక్షేమాలు తెలుసుకుంటూ...

■ పోలింగ్ కలిపింది!

ఒకేసారి ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారు, ఒకే పాఠశాలలో విధులు నిర్వర్తించిన వారు ఆతర్వాత వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఇలాంటి వారిలో పలువురు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలుసుకున్నారు. ఖమ్మంలోని రిక్కాబజార్ పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు వేసేందుకు పలువురు ఉపాధ్యాయులు తమ స్నేహితులను కలవగా ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉద్యోగం, కుటుంబం విషయాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత


మోదీ ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఫ్లెక్సీల ఏర్పాటుతో వివాదం

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. తొలుత పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి తరఫున ఏజెంట్ బూత్‌ల వద్ద ప్రచారం చేస్తున్నాడని టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ టీఎస్ తదితర సంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు. పోలీసులతో వాగ్వాదానికి దిగగా ఏజెంట్‌ను బయటకు పంపించడంతో వివాదం సద్దుమణిగింది. ఇదే కేంద్రం వద్ద వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు టెంట్లు వేసుకుని ప్రచారం చేయసాగారు. టీపీటీఎఫ్ మద్దతు ఇచ్చిన యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీజేపీ మద్దతు తెలిపిన సరోత్తమ్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తుండగా.. ఒకరు టెంట్ల ఎరుపు రంగుతో కూడిన ఫ్లెక్సీ, మరొకరు మోదీ చిత్రపటంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఇరువర్గాల నడుమ వివాదం నెలకొనగా పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఈక్రమాన తోపులాట జరగగా సిబ్బందిని పిలిపించి ఫ్లెక్సీలు తీయించారు. ఆపై పోలీసు వాహనాలను బీజేపీ నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు.


పోలీసు వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీఎస్ యూటీఎఫ్ నాయకులు

పోలింగ్ సరళిని పరిశీలించిన రవీందర్


కేంద్రంలో పరిశీలిస్తున్న పూల రవీందర్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన పూల రవీందర్ గురువారం ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిని పరిశీలించాక స్థానికుల నాయకులతో మాట్లాడారు. ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్, టీపీటీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గురుప్రసాద్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖరామత్ అలీ, నాయకులు సైదా, పుట్టా శ్రీనివాస్, గడల వెంకటరామారావు, జమాల్, అబ్రహం, అరుణాకర్, పడిగల రవి, పందిరి రమేష్, చెరుకుపల్లి మురళి పాల్గొన్నారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు!

ఖమ్మంక్రైం: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మం రిక్కాబజార్ స్కూల్‌లో పోలింగ్‌ను పరిశీలించిన ఆయన భద్రతపై సిబ్బందికి సూచనలు చేసి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏడుగురు ఏసీపీలు, 16మంది సీఐలు, 25మంది ఎస్ఐలు, 470మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.


పోలింగ్ కేంద్రంలో సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

వీరు పూర్వ విద్యార్థులే!

పెనుబల్లి : అందరి వయస్సు 75 ఏళ్లు దాటింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరి పిల్లలు చేతికి రావడంతో మనవళ్లు, మనవరాళ్లతో శేషజీవితం గడుపుతున్నారు. అయితే, నాటి పెనుబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. ప్రస్తుత వీఎం బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1965–64లో వీరందరూ 11వ తరగతి(హెచ్ఎస్‌సీ) చదివారు. పాఠశాలలో వీరికి రెండో బ్యాచ్‌గా 11మంది ఉండేవారు. ఇందులో తొమ్మిది మంది ఇటీవల కలుసుకోవాలని నిర్ణయించుకుని గురువారం పాఠశాలకు చేరుకుని ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు, తమను వీడిపోయిన మిత్రులను స్మరించుకోవడమేకాక పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన స్వర్గీయ ముఖ్యమంత్రి వెంగళరావు సేవలను కొనియాడారు.



ఆనాటి విద్యార్థులైన వంగా నరసింహాస్వామి, ఏటుకూరి రామారావు, కాటోజు మునేశ్వరరావు, బజ్జూరి వెంకటేశ్వరరావు, దామెర ప్రసాద్‌రావు, పోలకంపల్లి ధనుంజయ్‌రావు, సోమరాజు నాగభూషణ్‌రావు, ఏటుకూరి చిన్న కృష్ణారావు, వంగల రంగాచారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీలో ముగిసిన 'డబుల్స్' పోరు

- విజేతలుగా శశాంక్ – అధర్వ శర్మ
- బహుమతులు అందజేసిన కలెక్టర్


శర్మ - శశాంక్‌కు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న చల్లపల్లి రాధమ్మ స్మారక ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నీ చివరి దశకు చేరింది. ఈమేరకు డబుల్స్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శశాంక్(తెలంగాణ), అధర్వ శర్మ(మహారాష్ట్ర) జోడీ విజేతగా నిలిచింది. వీరు వంశ్ భిష్ట(ఢిల్లీ), దేవాసిసి సాహూ(ఒడిషా)తో తలపడగా 6–4, 6–4 తేడాతో ఘనవిజయం సాధించి టైటిల్ దక్కించుకున్నారు. అనంతరం విజేత జోడితో పాటు రన్నర్స్‌గా నిలిచిన వారికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. ప్రతిభచూపిన క్రీడాకారులకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. తొలుత పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాసరావు, టోర్నీ డైరెక్టర్ డాక్టర్ కాసినేని అనిల్‌తో పాటు మద్దినేని వెంకట్, కాంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్స్ విభాగంలో...

టోర్నీలో భాగంగా సింగిల్స్‌లో సెమీ ఫైనల్స్ గురువారం ముగిశాయి. మొదటి సెమీస్‌లో అధర్వ శర్మ (మహారాష్ట్ర) – రికీ చౌదరి (ఢిల్లీ) పోటీ పడగా 6–2, 6–1 తేడాతో నెగ్గిన శర్మ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. ఈ టోర్నీలో టాప్ సీడ్ ఉడిత్ కంబోజ్ తదితరులను ఓడిస్తూ వచ్చిన శర్మ ఫైనల్స్‌కు చేరడంతో కప్ సాధిస్తాడని అభిమానులు భావిస్తున్నారు. అలాగే, రెండో సెమీస్‌లో ఓగెస్ థేజో జయప్రకాష్(తమిళనాడు) సందేశ్ డి.కురలే(మహారాష్ట్ర)పై 6–2, 7–6 తేడాతో గెలిచి ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మొదటి సెట్‌లో సులభంగానే గెలిచిన జయప్రకాష్, రెండో సెట్‌లో టై బ్రేక్ సమయాన గట్టి పోటీ ఎదుర్కొన్నా విజయం సాధించాడు. దీంతో అధర్వ శర్మ, జయప్రకాష్ సింగిల్ ఫైనల్స్‌లో తలపడనున్నారు.


మ్యాచ్‌లను ప్రారంభించిన సీపీ సునీల్‌దత్

రేషన్‌కార్డుల తొలగింపుపై ఫిర్యాదులు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో వారం రోజుల వ్యవధిలో మూడు కుటుంబాలకు చెందిన రేషన్‌కార్డులను తొలగించడం విమర్శలకు తావిస్తోంది. ఎవరు ఫిర్యాదు చేయకున్నా, దరఖాస్తు ఇవ్వకున్నా కార్డులు తొలగించడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వారం క్రితం ఇద్దరి కార్డులు తొలగించారని ఫిర్యాదు చేయగా, తాజాగా గ్రామానికి చెందిన గరిడేపల్లి నర్సయ్య బతికున్నా మృతి చెందినట్లుగా కార్డులో నుంచి పేరు తొలగించారని గురువారం అధికారులను ఆశ్రయించాడు. వరుసగా కార్డుల తొలగింపుపై ఫిర్యాదులు అందుతుండడంతో స్థానికులు తమ కార్డులు ఉన్నాయా, లేవా అని తెలుసుకునేందుకు మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కాగా, కార్డు తొలగించాలంటే సంబంధిత సైట్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని, ఇది తహసీల్దార్ చేతిలోనే ఉంటుందని చెబుతున్నారు. అయితే, బాధితులంతా తహసీల్దార్‌ను ఆశ్రయిస్తుండగా ఆయన విచారణ జరిపిస్తామని చెబుతుండడంతో... కార్యాలయ సిబ్బంది ఎవరైనా ఈ పని చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ జె.మాణిక్‌రావ్‌ను వివరణ కోరగా ఫిర్యాదులపై విచారణ చేయిస్తున్నామని తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో 9 మందిపై కేసు

కొణిజర్ల: కొణిజర్ల మండలం లింగగూడెం, అమ్మపాలెం పరిధి ఇండోఖతార్ వెంచర్స్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించిన ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గుగులోత్ సూరజ్ గురువారం తెలిపారు. గ్రీన్‌ల్యాండ్ వెంచర్స్ యజమానులు నాలుగేళ్ల క్రితం వెంచర్‌లో విల్లాల డెవలప్‌మెంట్ కోసం పాలిశెట్టి గిరికి కొంత స్థలం అప్పగించారు. ఆయన విల్లాలు నిర్మించి అమ్ముతుండగా, గత ఏడాది డిసెంబర్ 28న వెంచర్స్ యజమానులు తనకు తెలియకుండా 64 ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని, అందులో అప్పటికే అమ్మేసిన విల్లాలు కూడా ఉన్నాయని వైరా ఏసీపీ, సబ్ రిజిస్ట్రార్‌కు గిరి ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ అనంతరం ఎం.రాము, ఎం.కిషోర్, కె.శరత్, బి.రాంబాబు, అరవింద్, అజయ్, వసీమ్, రాజా, ఉపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్‌లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైన్స్, బార్లను మూసివేయగా, గ్రామానికి చెందిన అన్నబత్తులు సత్తిబాబు మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 38 బీర్లు, 97 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు శివారు తోటలో పలువురు పేకాడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఇంకో ఇద్దరు పరారయ్యారని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.3,730 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

రైస్‌మిల్లులో బిహార్ హమాలీ మృతి

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి సమీపాన పద్మావతి శ్రీనివాస బాయిల్డ్ రైస్ మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన హమాలీ మహమ్మద్ ఇంతియాజ్(51) గురువారం మృతి చెందాడు. కొన్నాళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న ఆయన గురువారం తెల్లవారుజామున మృతదేహమై కనిపించాడు. మిల్లులో వడ్లను నిల్వ చేసే డ్రయర్ పైనుంచి కింద పడగా మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే, ఎత్తయిన డ్రయర్‌పైకి ఎందుకు వెళ్లాడు.. రాత్రి వేళ ఎందుకు వెళ్లిల్సి వచ్చిందో తెలియరాలేదు. ఈమేరకు మిల్లు యాజమానుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ...


మౌలాలీ (ఫైల్)

ముదిగొండ: ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న సుతారీ మేస్త్రి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ముదిగొండకు చెందిన మౌలాలీ(45) సుతారీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ముత్తారంలోని ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న ఆయన గురువారం పరంజీ పైనుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హై బీపీతో మౌలాలీ కళ్లు తిరిగి కింద పడినట్లు సమాచారం.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిరూరల్: టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమాన జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం సత్తుపల్లి మండలం కొత్తూరులో చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం గౌరిగూడెంకు చెందిన పుచ్చా పుల్లారావు, బేతుపల్లికి చెందిన సిద్ధిన నాగరాజు బైక్‌పై సత్తుపల్లి నుంచి కొత్తూరు మీదుగా గౌరిగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తూరు రైతువేదిక వద్ద రేజర్ల నుంచి కొత్తూరుకు మట్టి తీసుకెళ్తున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమాన వీరిద్దరు అదుపు తప్పి పడిపోయారు. దీంతో నాగరాజు కాళ్ల పైనుంచి మట్టి టిప్పర్ వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అలాగే, పుల్లారావు సైతం గాయపడగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి..

బోనకల్: మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపం వద్ద ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కొవ్వసూరి వినయ్, ఖమ్మం రఘునాథపాలెంకు చెందిన అల్లిక రామలింగేశ్వరావు కోటప్పకొండలో దైవదర్శనానికి వెళ్లి వస్తున్నారు. బోనకల్‌లో కారు పక్కకు ఆపి విశ్రాంతి తీసుకుంటుండగా ఖమ్మం నుంచి బోనకల్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వినయ్, రామలింగేశ్వరరావు గాయపడగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి హత్య కేసులో జీవిత ఖైదు

ప్రేమ పేరుతో తీసుకెళ్లిన యువకుడు హత్య చేసినట్లు నిర్ధారణ

పెనుబల్లి: యువతిని హత్య చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జడ్జి ఎం.శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన కావటి తేజస్విని గంగారంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదివేది. సత్తుపల్లికి చెందిన బెల్లేడు నితిన్ ప్రేమ పేరుతో ఆమె వెంట పడగా, మాయమాటలు చెప్పి ఇంటి నుంచి 2019 ఆగస్టులో బైక్‌పై తీసుకెళ్లిన ఆయన లంకపల్లి గుట్టల వద్ద కర్చీఫ్‌తో ఉరివేసి హతమార్చాడు. ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేయగా.. సీఐలు టి.సురేష్‌కుమార్, టి.రవికుమార్, టి.కరుణాకర్ దశల వారీగా విచారణ జరిపి నితిన్‌ను నిందితుడిగా గుర్తించి సత్తుపల్లి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం నితిన్ నిందితుడిగా తేలడంతో జీవిత ఖైదు విధించడమే కాక రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని సత్తుపల్లి రూరల్ సీఐ ఎం.ఎల్.ముత్తిలింగయ్య తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్ పాషా కేసు వాదించగా ఉద్యోగులు కె.శ్రీకాంత్, డి.నాగేశ్వరరావులు, కె.గిరి సహకరించారు. కాగా, తీర్పు వెలువడ్డాక నిందితుడిని వీఎంబంజర్ ఎస్సై కె.వెంకటేష్ సత్తుపల్లి సబ్ జైలుకు తరలించారు.